సాక్షి
ఖమ్మం
ఆదివారం । 13 । జూలై । 2025



ఉత్పత్తి.. ఉత్తుత్తే...
ఉమ్మడి జిల్లాలో ఏకైక చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం వైరాలో ఉండగా, సాకర్యాల లేమితో ఉత్పత్తిపై నీలినీడలు కమ్ముకున్నాయి. 8లో



ఎక్కడికక్కడే సేకరణ.. అమ్మకం
ఉమ్మడి జిల్లాలో విజయ డెయిరీ ద్వారా సేకరించే పాలను ఇక్కడే అమ్మేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 26°

వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున అర్చకులు స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం చేశారు. అతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల నుంచి హాజరైన భక్తుల నడుమ పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

'భక్తరామదాసు' నుంచి సాగునీటి విడుదల



మోటార్ వద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డ తండా వద్ద భక్తరామదాసు ప్రాజెక్టు నుండి సాగు అవసరాలకు అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ పూజలు నిర్వహించగా, ప్రాజెక్టు డీఈఈ రమేష్‌రెడ్డి మోటార్ స్విచాన్ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని ఆయకట్టుతో పాటు చెరువులకు నీరు చేరుతుందని డీఈఈ తెలిపారు. మెట్ట పంటలు, వరి సాగుకు తొలుత పదిరోజులు నీరు సరఫరా చేస్తామని, ఈలోగా పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరాక చెరువులను పూర్తిస్థాయిలో నింపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

35 మంది ఆపరేటర్ల బదిలీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని రెవెన్యూ శాఖలో ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న సీసీఎల్‌ఏ, భూభారతి ఆపరేటర్లను బదిలీ చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎల్‌ఏ టైపిస్టు కమ్ ఆపరేటర్లు 14మంది, 21మంది భూభారతి ఆపరేటర్లను బదిలీ చేయగా, నూతన స్థానాల్లో వెంటనే చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. పాలనలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం బదిలీలు చేపట్టామని తెలిపారు. రెవెన్యూ శాఖలో అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది విధుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రజలకు న్యాయం చేకూర్చాలనే నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

రుణాల మంజూరు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఉపాధి పునరావాస పథకం కింద దివ్యాంగులకు రుణాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాకు రూ.50 వేల యూనిట్లు 25, రూ.లక్ష, రూ.2లక్షలు, రూ.3లక్షల యూనిట్లు ఒక్కొక్కటి మంజూరయ్యానని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 14నుంచి 31వ తేదీ వరకు http//tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

31వరకు ఫీజు గడువు పొడిగింపు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఫీజు చెల్లించే గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ ఎస్.సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.పాపారావు తెలిపారు. అలాగే, ఆగస్టు 1నుండి 28వరకు సాధారణ ఫీజుతో పాటు పదో తరగతి వారు రూ.100, ఇంటర్మీడియట్ విద్యార్థులు రూ.200 జరిమానాతో ప్రవేశాలు పొందొచ్చని వెల్లడించారు. సమీపంలోని ఓపెన్ స్కూల్ సెంటర్లను లేదా www.telanganaopenschool.org వెబ్‌సైట్‌తో పాటు మీ సేవా, టీ సేవా సెంటర్లలో దరఖాస్తు చేసుకుని రెండు సెట్లను సెంటర్‌లో సమర్పించాలని సూచించారు. వివరాలకు 80084 03522 సంప్రదించాలని తెలిపారు.

వెదజల్లు.. సాగు ఫుల్లు!



కామేపల్లి మండలం తాళ్లగూడెంలో రైతులతో కలిసి విత్తనాలు వెదజల్లుతున్న వ్యవసాయాధికారులు



వైరా మండలంలో వెదజల్లే విధానంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నారు, నాట్లు లేకుండా వరి సాగుకు అవకాశం

- కూలీల కొరతకు చెక్, ఇతర ఖర్చులూ ఆదా
- జిల్లాలో వెదజల్లే పద్ధతికి పెరుగుతున్న ఆదరణ
- అధికారుల అవగాహనతో ముందుకొస్తున్న అన్నదాతలు

వరి సాగులో కొత్త ఒరవడి నానాటికీ విస్తృతమవుతోంది. నారు పోయడం, నాట్లు వేసే పని లేకుండా వెదజల్లే విధానంలో సాగుపై కలిగే లాభాలతో అధికారులు అవగాహన కల్పిస్తుండడంతో జిల్లా రైతులు ముందుకొస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వెదజల్లడం, ఇంకొన్ని ప్రాంతాల్లో కరివేదగా పిలిచే ఈ విధానంలో సాగు ఖర్చులు కూడా తగ్గుతుండడం రైతులకు కలిసొస్తోంది. – కామేపల్లి/వైరారూరల్

విస్తృత అవగాహన
వెదజల్లే విధానంలో వరి సాగుతో ఉన్న లాభాలను వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నానాటికీ పెరుగుతున్న కూలీల కొరతను అధిగమించొచ్చని, ఇతర ఖర్చులు కూడా తగ్గుతాయని చెబుతున్నారు. అంతేకాక అధికారులు క్షేత్రస్థాయిలో వెదజల్లే విధానంపై అవగాహన కల్పిస్తుండగా ఈ విధానం అవలంబించే రైతుల సంఖ్య పెరుగుతోంది. అలాగే, గతంలో సాగు చేసిన రైతులు సత్ఫలితాలు సాధించడంతో ఇంకొందరు కూడా ముందుకొస్తున్నారు.

పాత విధానంలో వ్యయప్రయాసలు
వరి సాగు చేసే రైతులు ఆది నుంచి ముందుగా నేల తయారీ, విత్తనాలతో నారు పోయడం.. ఆపై కలుపు తొలగించడం చేశాక పొలంలో నాట్లు వేయించేవారు. ఇదంతా కలిపి ఎకరానికి సుమారు రూ.25వేల వరకు ఖర్చవుతుంది. అందులో ప్రతీ పనికి కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. కానీ కూలీల కొరత ఏటా పెరుగుతుండడంతో ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించారు. అలాగే, నారు తొలగించే సమయాన వేర్లు తెగిపోయి అధిక శాతం పిలకలే మిగులుతుండడం రైతులకు ఆర్థికంగా నష్టం ఎదురవుతోంది. ఈక్రమంలోనే వెదజల్లే పద్ధతి తెరపైకి వచ్చింది.

ఖర్చులు ఆదా..
వెదజల్లే పద్ధతిలో రైతులు మామూలుగానే పొలం దుక్కి చేసుకోవాలి. ఆ తర్వాత ఎకరాకు 10 – 12 కేజీల లోపు వరి విత్తనాలను చల్లాలి. ఈ పద్ధతిలో ఎక్కువ ఎత్తు పెరగని రకం విత్తనాలు ఎంచుకోవాల్సి ఉంటుంది. అంతేకాక వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే కూలీల అవసరం పెద్దగా లేకపోగా, ఎకరాకు సుమారు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. కొన్నిచోట్ల పొడి దుక్కుల్లోనే రైతులు విత్తనాలు వెదజల్లుతుండగా వర్షాలు పడగానే మొలకెత్తుతున్నాయి. ఇక కాల్వల పరీవాహక ప్రాంతాల్లో తడి దుక్కుల్లో విత్తనాలు వెదజల్లి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇంకొందరు విత్తన శుద్ధి తర్వాత నానబెట్టడం, ఆపై గన్నీ సంచుల్లో నిల్వ చేసి మొలకలు వచ్చాక వెదజల్లే పద్ధతి అవలంబిస్తున్నారు. ఈమేరకు జిల్లాలోని ఒక్క కామేపల్లి మండలంలోని తాళ్లపల్లి, పండితాపురంలో సుమారు 2,200 ఎకరాల్లో వెదజల్లే విధానంలో వరి సాగు చేస్తుండా ఇంకొందరు రైతులు కూడా ముందుకొస్తున్నారు. అంతేకాక వైరా, తదితర మండలాల్లో ఈ విధానం నానాటికీ విస్తరిస్తోంది. కాగా, ఈ విధానంలో పెట్టుబడి తగ్గడమే కాక సాధారణ విధానంతో పోలిస్తే 15 రోజుల ముందే పంట కోత దశకు చేరుతోంది.

ఆదాయం పెరుగుతోంది..



గత యాసంగిలో నాలుగు ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాను. సాధారణ నాట్ల కంటే ఇది సులువుగా ఉంది. ఎకరాకు రూ.10వేల ఖర్చు తగ్గింది. పైరు కూడా ఆశించిన స్థాయిలో పెరుగుతోంది. ఈ విధానంలో పెట్టుబడి తగ్గడమే కాక ఆదాయం పెరుగుతోంది.
– కె.శ్రీనివాసరావు, రైతు, సోమవరం, వైరా మండలం

రైతులకు ఎంతో మేలు..



వరి సాగు చేసే రైతులు వెదజల్లే పద్ధతి అవలంబిస్తే శ్రమ తగ్గుతుంది. డ్రమ్ సీడర్ విధానంలో కూడా వరి సాగు చేసుకోవచ్చు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ మంది రైతులు ముందుకొచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. వెదజల్లే విధానంలో సాగుకు ఇది సరైన సమయం.
– భూక్యా తారాదేవి, ఏఓ, కామేపల్లి

'సీతారామ' జలాలు విడుదల

- మోటార్ ఆన్ చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం
- సమస్యను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లడంతో ఫలితం



పంప్‌హౌస్ ద్వారా దిగువకు విడుదలవుతున్న గోదావరి జలాలు

అశ్వాపురం/ఖమ్మంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఒక మోటార్‌ను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్విచాన్ చేసి నీరు విడుదల చేశారు. నాగార్జుసాగర్ నుంచి సాగు అవసరాలకు నీరు విడుదల కాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నారుమడులు ఎండిపోతున్న విషయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యాన అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో 8లక్షల క్యూసెక్కుల జలాలు డిశ్చార్జ్ అవుతుండడంతో, ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేవరకు పంప్‌హౌస్ నుంచి నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. గోదావరి జలాలు ఇక్కడి నుంచి ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) ద్వారా ఎన్ఎస్‌పీ కెనాల్‌కు తరలనున్నాయి. ఆపై వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందనుంది. కాగా, నీటి విడుదల కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెమ్మదిస్తున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి



సున్నంబట్టి రహదారిపైకి చేరిన వరద నీరు

భద్రాచలం వద్ద 41.5 అడుగులకు పెరిగి తగ్గుతున్న వరద

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో వరద ప్రవాహం శనివారం సాయంత్రం నుంచి నెమ్మదించింది. ఎగువన ప్రాజెక్టుల నుంచి వరద భారీగా వస్తుండడంతో రెండు రోజులుగా నదిలో ఉధృతి పెరిగింది. వరద నీటిమట్టం శుక్రవారం రాత్రి 11 గంటలకు 38.8అడుగులకు చేరింది. శనివారం ఉదయం 40.5 అడుగులకు, క్రమంగా మధ్యాహ్నం వరకు 41.5 అడుగులకు పెరిగింది. అనంతరం తగ్గుముఖం పట్టింది. రాత్రి 9గంటలకు 40 అడుగులకు తగ్గింది. ఎగువన ఉన్న ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గుతుండడంతో క్రమంగా గోదావరి వరద కూడా తగ్గుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరద ఉధృతితో రహదారులు మునిగి భద్రాచలం దిగువన ఏపీలోని విలీన మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆపై వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జిల్లా అధికారులు, ముంపు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దుమ్ముగూడెంలో నిలకడగా..
దుమ్ముగూడెం: ఎగువ ప్రాంతాల నుంచి వరద నెమ్మదించడంతో శనివారం మండలంలో గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. పర్ణశాల నారచీరల ప్రాంతం వరద నీటిలోనే మునిగి ఉండగా, సున్నంబట్టి–బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారి పైకి వరద నీరు చేరింది.

ఇక పవర్ 'ఫుల్'



జల విద్యుదుత్పత్తి కేంద్రం వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం చేస్తున్న ఉద్యోగులు



సీసీ నిర్మాణంతో పటిష్టం చేసిన కాల్వ కట్ట

- విద్యుదుత్పత్తికి మినీ హైడల్ ప్రాజెక్టు సిద్ధం
- కాల్వ కట్టలు పటిష్టం, యూనిట్లకు మరమ్మతులు
- గతేడాది భారీ వరదలతో దెబ్బతిన్న ప్రాజెక్టు

కూసుమంచి: మండలంలోని పాలేరులో ఉన్న మినీ హైడల్ ప్రాజెక్టు(జల విద్యుదుత్పత్తి కేంద్రం)లో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్టుకు నీరు సరఫరా చేసే కాల్వ కట్టలు తెగిపోగా ప్రాజెక్టులోని యూనిట్లు, ప్యానల్ బోర్డులు సైతం నీటమునిగాయి. ఈ ప్రాజెక్టును జెన్‌కో ఆధ్వర్యాన పులిచింతల ప్రాజెక్టు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈమేరకు మరమ్మతుల కోసం రూ.5.50కోట్లు కేటాయించగా కొద్ది నెలలుగా చేపడుతున్న పనులు చివరి దశకు చేరాయి.

భారీ గండి పూడ్చివేత
భారీ వరదతో రిజర్వాయర్ నుంచి ప్రాజెక్టుకు నీరు సరఫరా చేసే కాల్వ కట్టలు తెగిపోయి గండి పడింది. దీంతో ప్రాజెక్టు కాల్వ నామరూపాలు లేకుండా పోయింది. ఈనేపథ్యాన అధికారులు వందలాది లారీల మట్టితో కట్టను యథావిధిగా నిర్మించారు. అంతేకాక మరోమారు వరద వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా కాంక్రీట్‌తో పటిష్టం చేశారు. అలాగే, ప్రాజెక్టు ముందు భాగం కూడా వరద ప్రవాహంతో కోతకు గురవడంతో పటిష్టం చేసి సీసీ రహదారి నిర్మించి పూర్వ స్థితికి తీసుకొచ్చారు.

రెండు యూనిట్లు సిద్ధం
ప్రాజెక్టులో విద్యుదుత్పత్తికి రెండు టర్బయిన్లు (యూనిట్లు) ఏర్పాటుచేశారు. ఇందులో ఒక్కో యూనిట్ గంటకు ఒక మెగావాట్ చొప్పున విద్యుదుత్పత్తి చేస్తాయి. వరదలకు ముందే ఒక యూనిట్ మరమ్మతులకు గురవడం, వరదల్లో మరో యూనిట్ దెబ్బతినడంతో రెండింటికీ అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. అలాగే, నీట మునిగిన విద్యుత్ ప్యానెల్ బోర్డులను సైతం సరిచేశారు. ఇక మిగిలిన చిన్నచిన్న మరమ్మతులు చివరి దశకు చేరాయి. పాలేరు రిజర్వాయర్ నుండి ఎడమ కాల్వకు నీరు విడుదల చేసినప్పుడు ఆ నీరు, రిజర్వాయర్ నీటిమట్టం ఆధారంగా ఈ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. కాగా, రిజర్వాయర్‌కు త్వరలోనే సాగర్ జలాలు సరఫరా చేయనుండడడంతో జిల్లాలోని ఆయకట్టుకు విడుదల చేసేలా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదే సమయాన ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి ప్రారంభించాలనే యోచనలో ఉన్నారు.

అన్ని పనులు పూర్తి
పాలేరు వద్ద మినీ హైడల్ ప్రాజెక్టు వరదలతో దెబ్బతినగా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాం. ప్రాజెక్టులో సివిల్, ఇంజనీరింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన చిన్నపాటి పనులు త్వరలోనే పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి మొదలుపెట్టేలా సిద్ధం చేస్తున్నాం.
– దేశ్యానాయక్, ఎస్ఈ, పులిచింతల ప్రాజెక్టు

ఆదాయం వచ్చే పంటలపై దృష్టి పెట్టాలి



కొణిజర్ల : సదస్సులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే రాందాస్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు తదితరులు

- నవంబర్ నాటికి అంజనాపురంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం అర్బన్ : వక్క మొక్క వద్ద మంత్రి తుమ్మల, కలెక్టర్, డీఎఫ్ఓ తదితరులు

కొణిజర్ల: రైతులు సంప్రదాయ పంటల స్థానంలో అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్‌పామ్, వక్క తదితర పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ సహకార, మార్కెటింగ్ పట్టు పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కొణిజర్ల మండలం అంజనాపురంలో శనివారం నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. అయితే, విత్తనాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తుండగా, కల్తీని మొక్కలు పెద్దయ్యే వరకు గుర్తించలేకపోతున్నామని చెప్పారు. ఈనేపథ్యాన గోద్రెజ్ కంపెనీ బాధ్యులు దేశంలోనే తొలిసారి కొణిజర్లలో సీడ్ గార్డెన్ ఏర్పాటుకు ముందుకొచ్చారని తెలిపారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో ఒప్పందం చేసుకోవడంతో ముందడుగు పడిందన్నారు. అంజనాపురంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఈ ఏడాది నవంబర్ నాటికి సిద్ధం చేయాలని, రీసెర్చ్ సెంటర్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.


ఫ్యాక్టరీ ప్రారంభించకపోతే దున్నిస్తాం..
వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ అన్ని సహాయ, సహకారాలు అందుతున్నందున నవంబర్ నాటికి కంపెనీ ప్రతినిధులు ఫ్యాక్టరీని ప్రారంభించాలని సూచించారు. లేనిపక్షంలో రైతుల వద్ద నుంచి తీసుకున్న భూమిని తానే దగ్గరుండి దున్నిస్తానని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడగా డీఏఓ డి.పుల్లయ్య, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎం.వీ. మధుసూదన్‌రావు, ఉద్యాన శాస్త్రవేత్త ఎన్.వీ ప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, గోద్రెజ్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో ఆరోగ్యం
ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: పర్యావరణ పరిరక్షణే కాక అందరం ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లోని రెండెకరాల స్థలంలో శనివారం వనమహోత్సవంలో భాగంగా ఆర్కానట్ (వక్క) మొక్కలు నాటారు. కలెక్టర్ అనుదీప్, మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి మొక్కలు నాటాక మంత్రి మాట్లాడుతూ కోనోకార్పస్ మొక్కలతో మంచి జరగడం లేదనే కథనాల నేపథ్యాన వాటిని తొలగించి మహాగని, ఆర్కానట్ మొక్కలు నాటనున్నామని తెలిపారు. అనంతరం రఘునాథపాలెం మండలం కే.వీ.బంజరలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కే.వీ.బంజర నుంచి కొత్తతండా క్రాస్ వరకు రూ.1.30 కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు కలెక్టర్ అనుదీప్‌తో కలిసి శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మకమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక, కార్పొరేటర్లు లకావత్ బాలాజీ, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళితో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, రావూరి సైదబాబు, తాతా రఘురాం, తుపాకుల ఎలగొండస్వామి, వాంకుడోత్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బోడకాకర.. కాస్ట్లీ గురూ!

కిలోకు రూ.320కి పైగానే ధర

ఖమ్మంవ్యవసాయం/మధిర: కాకరలో ఓ రకం బోడ కాకర. ఏటా ఈ సీజన్‌లో, అదీ తక్కువగా లభించే ఈ కాకరకు డిమాండ్ ఉంటుంది. జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే బోడ కాకర కాయలు విక్రయిస్తుండగా ప్రాంతాల వారీగా కిలో ధర రూ.320 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. ఖమ్మంలోని రైతుబజార్ల బోర్డులపై రూ.280గా రాస్తున్నా ఆ ధరకు విక్రయించడం లేదు. ప్రస్తుతం ఏపీలోని గోదావరి జిల్లాల నుంచి బోడ కాకర ఖమ్మం మార్కెట్‌కు వస్తోందని చెబుతున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో రిటైల్ వ్యాపారులు రూ.200 చొప్పున కొనుగోలు చేసి రూ.320, అంతకంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.



చికెన్ ధర కన్నా అధికం
సాధారణంగా బోడకాకర ధర కిలో రూ.180నుంచి రూ.200 వరకు పలుకుతుంది. కానీ ఈసారి ధర పెరగడం గమనార్హం. ప్రస్తుతం చికెన్ కిలో ధర రూ.200 ఉండగా.. అంతకు మించి బోడ కాకర ధర ఉండడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. కొందరు మాత్రం ఈ సీజన్‌లో లభించేది కావడంతో భారమైనా కొనుగోలు చేస్తున్నారు. గుట్టలు, కొండలు, అడవుల్లో లభించే ఈ కాకరను ప్రస్తుతం కొందరు రైతులు సాగు చేస్తున్నారు.

క్లుప్తంగా

సకాలంలో వ్యాక్సినేషన్‌తో వ్యాధులు దూరం



తల్లాడ పీహెచ్‌సీలో వ్యాక్సిన్లు పరిశీలిస్తున్న మేనేజర్ వెంకటరమణ

తల్లాడ/కల్లూరు: అవసరమైన మేర వ్యాక్సిన్లను సకాలంలో వేయడం ద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడొచ్చని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.వెంకటరమణ తెలిపారు. తల్లాడ, కల్లూరు పీహెచ్‌సీల్లో శనివారం తనిఖీ చేసిన ఆయన వ్యాక్సిన్ల నిలవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ పిల్లలకు 12 రకాల వ్యాధులు రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నందున తల్లిదండ్రులు సకాలంలో వేయించేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆతర్వాత కల్లూరు అంబేద్కర్ నగర్‌లో వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. వైద్యాధికారి నవ్యకాంత్, ఉద్యోగులు కె.పెద్ద పుల్లయ్య, శ్రీనివాస్, శిరీష, శ్రావణ సంధ్య, సరోజిని, జి.రామారావు, అనూష, భారతి, నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుమందు ఇచ్చి ఆభరణాలు చోరీ

కూసుమంచి: కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి అది తాగాక యువతి స్పృహ కోల్పోవడంతో ఆమె చెవి జూకాలు ఎత్తుకెళ్లిన ఘటన ఇది. మండలంలోని చేగొమ్మకు చెందిన చుంచు ఉమారాణి, ఆమె సోదరుడు ప్రవీణ్ ఇద్దరూ మానసిక దివ్యాంగులు. శుక్రవారం మధ్యాహ్నం వారిద్దరు ఇంటి వద్ద ఉండగా ఓ మహిళ, మరో వ్యక్తి వచ్చారు. ఉమారాణి, ప్రవీణ్‌తో మాట్లాడుతూనే ముందుగా మత్తు మందు కలిపి తీసుకొచ్చిన కూల్‌డ్రింక్‌ను వారికి ఇవ్వగా తాగి స్పృహ కోల్పోయారు. ఆపై ఉమారాణి చెవులకు ఉన్న జూకాలు తీసుకుని నిందితులు పారిపోయారు. ఘటనపై బాధితురాలి మామ తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నయాబజార్ స్కూల్ ఎదురుగా శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో విద్యార్థికి గాయాలయ్యాయి. నయాబజార్ స్కూల్ ప్రాంగణంలోని బీసీ వసతిగృహంలో ఉంటున్న తెల్దారుపల్లికి చెందిన విద్యార్థి వివేకవర్ధన్ రెండు రోజుల వరుస సెలవులతో శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లాడు. తిరిగి శనివారం తిరిగి ఖమ్మం రాగా, కాల్వొడ్డు వద్ద రోడ్డు దాటుతున్న సమయాన టాటా ఏస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వివేకవర్ధన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మత్తులో నలుగురిపై దాడి

కామేపల్లి: ఓ వ్యక్తి మత్తులో నలుగురిపై సర్జికల్ బ్లేడుతో దాడి చేసి గాయపర్చాడు. మండలంలోని కొత్తలింగాలకు చెందిన రెట్టాల గోపీ శనివారం రాత్రి మద్యం లేదా గంజాయి మత్తులో ఉన్నట్లు తెలుస్తుండగా, గ్రామానికే చెందిన ఎలమందల రాహుల్, కొరివి నాగేశ్వరరావు, శ్యామ్, గుదిమళ్ల సాయిపై దాడి చేశాడు. గాయపడిన వీరిని ఖమ్మం తరలించారు.

ఉత్పత్తి.. ఉత్తుత్తే...



లైనింగ్ లేక నీరు నిలవని పాండ్లు

వైరాలో 48ఏళ్ల క్రితం చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు

- ఇక్కడే గంబూషియా చేపపిల్లలు కూడా..
- నిర్వహణ లోపంతో నానాటికీ కుదేలవుతున్న కేంద్రం
- అయినా పట్టింపు లేనట్లుగా అధికారులు



శిథిలావస్థకు చేరిన మత్స్య విత్తన కేంద్ర కార్యాలయం

వైరా: జిల్లాలోని వైరాలో 48ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం(మత్స్య విత్తన కేంద్రం) నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. కేంద్రంపై పాలకులు, అధికారులు సవతితల్లి ప్రేమ కనబరుస్తుండడంతో ఉత్పత్తిపై నీలినీడలు కమ్ముకున్నాయి. సరైన సౌకర్యాలు లేక, సరిపడా సిబ్బందిని నియమించక ఈ పరిస్థితి ఎదురవుతోంది. కార్యాలయం, హెచరీ గది శిథిలావస్థకు చేరడంతో కేంద్రం కళ తప్పింది. అంతేకాక ఇక్కడ ఐదుగురు ఫిషర్‌మెన్స్ పోస్టులకు గాను ఇద్దరే విధులు నిర్వర్తిస్తున్నారు.

ముంచుకొచ్చిన సీజన్

చేపపిల్లల సంతానోత్పత్తికి జూలై, ఆగస్టు మాసాలే అనువైనవి. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేప పిల్లలను స్పాన్‌గా మారుస్తారు. తొలుత చెరువుల నుంచి తల్లి చేపలను తీసుకుకొచ్చి గుడ్లు సేకరిస్తారు. ఆపై హెచరీలో స్పాన్ తయారుచేసి పిల్లలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇదంతా జూన్ మాసం నుంచి ఆగస్టు 2వ వారం వరకు పూర్తి చేసి పిల్లలను మత్స్య సహకార సంఘాలకు ఉచితంగా సరఫరా చేసేవారు. ఈ కేంద్రంలో బంగారు తీగ, బొచ్చ, కట్ల, రోహూ రకాల 14లక్షల చొప్పున, గంబూషియా చేప పిల్లలు లక్ష మేర ఉత్పత్తి జరిగేది. కానీ పరిస్థితులు అనువుగా లేక ఇప్పటివరకు కూడా ఉత్పత్తి మొదలుకాలేదు. వైరా మత్స్య విత్తన కేంద్రం పరిధిలో 6వేల మందితో కూడి 55 మత్స్య సొసైటీలు ఉన్నాయి. వీరు 493 చెరువుల్లో చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు.

దిగుమతి అవసరమే ఉండదు..

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో సౌకర్యాలు కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. ఏటా మత్స్యకారులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై చేపపిల్లల పంపిణీకి టెండర్లు ఆహ్వానిస్తోంది. ఇందుకు రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తున్నారు. అయితే, వైరా కేంద్రంలో చేపపిల్లలు ఉత్పత్తి మొదలైతే బయట కొనుగోలు చేయకుండా ఉమ్మడి జిల్లాలోని చెరువులన్నింటికీ సరఫరా చేయొచ్చు.

ఇవీ ప్రధాన సమస్యలు...

తల్లి చేపల నుంచి సేకరించే గుడ్లను హెచరీలో స్పాన్‌గా మారుస్తారు. అయితే, కేంద్రంలోని హెచరీ గది ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా శిథిలమవడంతో పాటు పైపులైన్ల లీకేజీతో నీరు సరఫరా కావడం లేదు. అలాగే, బాయిలర్లు తుప్పుపట్టిపోయాయి. అంతేకాక కేంద్రంలోని 38 సిమెంట్ పాండ్లకు ఎనిమిది శిథిలమవగా.. మరో ఐదు పాండ్ల లైనింగ్ కూలిపోయింది. అలాగే, మోటర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. వీటికి తోడు ప్రహరీ లేక, 48ఏళ్ల క్రితం నిర్మించిన కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడం గమనార్హం.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

కేంద్రంలో వసతులు లేక చేపపిల్లల ఉత్పత్తి ఇబ్బందిగా మారింది. ఇక్కడి సమస్యలను అధికారులకు నివేదించాం. మత్స్య విత్తన కేంద్రం ఆధునీకీకరణకు ప్రతిపాదనలు కూడా పంపించాం. నిధులు మంజూరైతే సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

– శివప్రసాద్, ఎఫ్‌డీఓ, వైరా

ఎక్కడికక్కడే సేకరణ.. అమ్మకం



ఖమ్మంలోని విజయ డెయిరీ కార్యాలయం

- విజయ డెయిరీ అధికారుల కార్యాచరణ
- పట్టణాల్లో ఇంకొన్ని పార్లర్ల ఏర్పాటుకు చర్యలు
- ఏజెంట్లను మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయం



ఖమ్మం యూనిట్‌లో పాలు ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది



విజయ పాలు

ఖమ్మంవ్యవసాయం: పాల ప్రాధాన్యత పెరిగిన నేపథ్యాన సేకరణ, విక్రయాలు మరింత పెంచాలని రాష్ట్ర పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని యూనిట్ల వారీగా సేకరించిన పాలను ఆయా యూనిట్ల పరిధిలోనే ఏ రోజుకు ఆ రోజు విక్రయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయాన పాల ఉత్పత్తుల వ్యాపారంపైనా దృష్టి సారించాలని ఆ ఆదేశాల్లో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం యూనిట్లలో సేకరించే పాలలో తక్కువ శాతం స్థానికంగా విక్రయిస్తూ మిగిలిన పాలను రాష్ట్ర పాడి పరిశ్రమకు చేరవేస్తున్నారు. అక్కడ పాలను పాడిగానే కాక ఇతర ఉత్పత్తులుగా మార్చి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో ఖర్చు పెరుగుతుండడమే కాక వ్యాపారం మందగించినప్పుడు పాల ఉత్పత్తులు పేరుకుపోతున్నాయి. ఈ అంశంపై సమీక్షించిన అధికారులు ప్రైవేట్ సంస్థల మాదిరిగానే ఎక్కడ సేకరించిన పాలను అక్కడే విక్రయించాలనే నిర్ణయానికి వచ్చారు. 'విజయ' డెయిరీ పాలకు ఆదరణ ఉన్నప్పటికీ అందుబాటులో లేక వ్యాపారం తగ్గుతుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

6వేల లీటర్ల సేకరణ

ఖమ్మంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) యూనిట్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 30మండలాల్లో 227 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 3,025 మంది పాడి రైతుల నుంచి నిత్యం 6వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. కామేపల్లి, మధిర, ఎర్రుపాలెం, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెంలోని పాల శీతలీకరణ కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతోంది. ఖమ్మంలోని రోటరీనగర్‌లో 25వేల లీటర్ల సామర్థ్యంతో యూనిట్ ఉన్నా అందుకు అనుగుణంగా పాల సేకరణ జరగడం లేదు. సీజన్‌లో 15వేల లీటర్ల పైగా, మిగతా సమయాల్లో ఆరు వేల లీటర్లు దాటడం లేదు.

స్థానికంగా వ్యాపారంపై ప్రణాళిక

ఉమ్మడి జిల్లాలో సేకరించే పాలను స్థానికంగానే విక్రయించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం 6వేల లీటర్ల మేర పాలు సేకరిస్తుండగా రెండు వేల లీటర్లే ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇందులో 1,500 లీటర్లు ప్రైవేట్ మార్కెట్ ద్వారా, 500 లీటర్ల పాలను ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నారు. మిగిలిన పాలను హైదరాబాద్ రాష్ట్ర పాడి పరిశ్రమకు పంపిస్తున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు ఉన్నందున అన్నింటికీ విజయ పాలు సరఫరా చేసేలా నిర్ణయించి, భద్రాచలం ఐటీడీఏ పీఓను డెయిరీ పాడి పరిశ్రమ అధికారులు కలిశారు. అన్నీ కలిసొస్తే త్వరలోనే ఇక్కడే విజయ డెయిరీ పాల విక్రయం పెరగనుంది.

పాల సేకరణ పెంపునకు కృషి



ఉమ్మడి జిల్లాలో పాల విక్రయానికి వనరులు ఉన్నాయి. ప్రస్తుతం సేకరిస్తున్న పాలలో మూడో వంతే ఇక్కడ విక్రయిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో మొత్తం పాలను స్థానికంగా విక్రయానికి ప్రణాళిక రూపొందించారు. ఇదే సమయాన పాల సేకరణను 20 వేల లీటర్లకు పెంచేలా కృషి చేస్తున్నాం.

– కె.రవికుమార్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్, ఖమ్మం

మరిన్ని పార్లర్లు, ఏజెంట్లకు ప్రోత్సాహం

విజయ పాలకు ఉన్న డిమాండ్ ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో పార్లర్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మంతో పాటు జిల్లాలో కేవలం ఐదు పార్లర్లే కొనసాగుతున్నాయి. విజయ పాలు, పాల ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నప్పటికీ లభ్యత లేక ప్రజలు ప్రైవేట్ డెయిరీలపై ఆధారపడుతున్నారు. ఈనేపథ్యాన పార్లర్లు కనీసం మరో 15 ఏర్పాటుచేయడం ద్వారా విక్రయాలు మరింత పెరుగుతాయని చెబుతున్నారు. ఖమ్మంతో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, అశ్వాపురం, భద్రాచలం, కోదాడ, సూర్యాపేటల్లో కూడా పార్లర్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. ఇదే సమాయన ఏజెంట్లను ప్రోత్సహించాలనే భావనకు వచ్చారు. సంస్థ లీటర్ పాలపై డిస్ట్రిబ్యూటర్లకు రూ.5 చొప్పున కమీషన్ ఇస్తుంది. అక్కడి నుంచి ఏజెంట్లకు సరఫరా చేస్తారు. ఈనేపథ్యాన ఏజెంట్లను మరింతగా పెంచడం ద్వారా వ్యాపారం పెంపొందించేలా కసరత్తు మొదలుపెట్టారు.

ఎండిపోతున్న వరి నారుమడులు

- వర్షాభావ పరిస్థితులతో రైతుల ఆందోళన
- సీతారామ జలాలు విడుదల కావడంతో ఊరట



నీరు లేక ఎండిపోతున్న వరి పొలం

కల్లూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు దోబూచులాడుతున్నాయి. ఇప్పటికే వరకు సరైన వర్షాలు లేక నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయలేదు. దీంతో ఆయకట్టు ప్రాంతంలోని వరి నారుమడులు ఎండిపోతున్నాయి. కల్లూరు మండలంలోని వాచ్యానాయక్ తండా, చంద్రుపట్ల, రఘునాథ బంజరు, లింగాల, పుణ్యపురం మేజర్ కాలువ్వ కింద పాయపూరు, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, ఓబులరావు బంజరు గ్రామాల్లో గత నెల 15వ తేదీ నుంచి వరి నారు సిద్ధం చేసుకుంటున్నారు. సాగర్ నీటి విడుదల ఆలస్యమైనా తప్పక నీరు అందుతుందనే భావనతో నార్లు పోయగా, కొందరు నాట్లు కూడా వేశారు. కానీ ఇప్పుడు వర్షాభావ పరిస్థితులు, సాగర్ నీటి విడుదలలో జాప్యంతో నారుమడులు, నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

సీతారామ ప్రాజెక్టు నీరే ఆధారం

సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల కాక వరి నాట్లు ఎండిపోయే పరిస్థితులు ఎదురవుతుండగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడం రైతుల్లో ఆశలు నింపింది. కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో 70శాతం మేరకు నాట్లు పూర్తికాగా, నాలుగు మండలాల్లో 69వేల ఎకరాల్లో నాట్లు వేసినటు అంచనా. ఈనేపథ్యాన శనివారం సీతారామ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరువ్యాపారులకు అండగా 'పోస్టల్ బ్యాంకు'



పోస్టల్ బ్యాంక్ మర్చంట్ యాప్ బ్రోచర్

ఖమ్మంగాంధీచౌక్: నగదు రహిత విధానం లావాదేవీలు పెరిగిన నేపథ్యాన చిరు వ్యాపారుల కోసం వాణిజ్య బ్యాంకుల తరహాలోనే పోస్టల్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) మర్చంట్ యాప్‌ను రూపొందించారు. వీధి వ్యాపారులు, కిరాణ షాపులు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు, ఇతర చిన్న వ్యాపారులు వినియోగదారుల నుంచి డిజిటల్ విధానంలో చెల్లింపుల స్వీకరణకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో క్యూఆర్ కోడ్లను సౌకర్యంగా పొందించారు. గుర్తింపు కార్డు మాదిరిగా మెడలో వేసుకునేలా, స్టాండ్ విధానంలో అమర్చేలా క్యూఆర్ కోడ్‌లను రూపొందించారు. వ్యాపారులు తమ ఆధార్ కార్డుతో సమీప పోస్టాఫీస్‌లో సంప్రదించి రూ.200తో పోస్టల్ పేమెంట్ బ్యాంకులో ఖాతా తెరిస్తే అదనపు ఫీజు లేకుండా డిజిటల్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 2వేల మందికి చిరువ్యాపారులు ఈ విధానంలో లావాదేవీలు నిర్వహిస్తున్నందున మిగతా వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి సూచించారు.

రెసిడెన్షియల్ స్కూళ్ల పనివేళలు మార్చాలి

పెనుబల్లి: విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని రెసిడెన్షియల్ పాఠశాలల పనివేళలు మార్చాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. పెనుబల్లిలోని రెసిడెన్షియల్ పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన మాట్లాడారు. ఉదయం 8గంటలకే పాఠశాల మొదలవుతుండడంతో విద్యార్థులు సిద్ధం కాలేకపోతున్నారని తెలిపారు. అలాగే, ఉదయం 7–30కు అల్పాహారం అందించి, మధ్యాహ్నం 1–30తర్వాత భోజనం పెడుతుండడంతో ఆకలితో పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపలేకపోతున్నారని తెలిపారు. ఇకనైనా పాఠశాలలను ఉదయం 9గంటలకు మొదలుపెట్టడమే కాక వార్డెన్ పోస్టు, కేర్ టేకర్ పోస్టులు మంజూరు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం చెల్లించాలని, మినిమం బేసిక్ పే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీ.వీ.రామారావుతో పాటు జి.వీరస్వామి, జి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంచం పైనుంచి పడి చిన్నారి మృతి

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో తొమ్మిది నెలల చిన్నారి ప్రమాదవశాత్తు మంచం పైనుంచి కింద పడగా మృతి చెందింది. గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ హబీదాబేగంకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో చిన్న కుమార్తె హాషిరా శుక్రవారం మంచంపై ఉండగా, ప్రమాదవశాత్తు కింద పడగా కోమాలోకి వెళ్లింది. దీంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

అరుణాచలం యాత్రలో విషాదం

మార్గమధ్యలో ఖమ్మం వాసి మృతి



చిన సుబ్బాచారి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: తమిళనాడులోని అరుణాచలేశ్వర స్వామి దర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం వాసి మృతి చెందాడు. ఖమ్మం 4వ డివిజన్ వేణుగోపాల్‌నగర్‌కు చెందిన శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి ఆలయ సభ్యుడు యర్రోజు చిన సుబ్బాచారి(50), దేవస్థాన మాజీ చైర్మన్ కొండల్‌తో పాటు వీరన్న, మణికంఠ తదితరులు రెండు రోజుల క్రితం స్వామి దర్శనానికి కారులో బయలుదేరారు. అరుణాచలం సమీపానికి చేరగా వీరి కారును ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్న సుబ్బాచారి తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంకా కొండల్, వీరన్న, మణికంఠ తదితరులకు గాయాలయ్యాయి. ఈమేరకు సుబ్బాచారి మృతదేహాన్ని శనివారం ఖమ్మం తీసుకురాగా, పలువురు నివాళులర్పించాక అంత్యక్రియలు పూర్తిచేశారు. కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, నాగండ్ల కోటి, పల్లెబోయిన భారతిచంద్రం, అభయ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ బొల్లి కోమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జలపాతం

వెన్నెల జలపాతం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ఇటీవల వర్షాలతో జలశోభ సంతరించుకుంది. మణుగూరు మండలంలోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలోని రథంగుట్ట అర్బన్ పార్క్‌లోని జలపాతానికి సందర్శకుల తాకిడి పెరిగింది. రేగా కాంతారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చొరవతో జలపాతం నూతన హంగులు దిద్దుకుంది. ప్రస్తుతం మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అటవీశాఖ రేంజ్ అధికారి ఉపేందర్ తెలిపారు. జలపాతం వద్ద స్విమ్మింగ్ పూల్ సైతం ఏర్పాటు చేశారు. పరిసరాల్లో బల్లలు ఏర్పాటుచేసి, రహదారి, కుటీరాలు మెరుగుపచ్చాలని సందర్శకులు కోరుతున్నారు. – మణుగూరు రూరల్



జలపాతం వద్ద పర్యాటకుల రద్దీ



వెన్నెల జలపాతం

కుక్క, కోతి దాడిలో నలుగురికి గాయాలు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, ముదిగొండ, యడవల్లి గ్రామాల్లో శనివారం కుక్క, కోతి చేసిన దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. వీధిలో వెళుతున్న నఫీసా, మరో కూలీపై కుక్క దాడి చేయగా, మరో ఇద్దరిపై కోతులు దాడి చేశాయి. ఈమేరకు గాయపడిన వారికి ముదిగొండ పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

మట్టి తోలకాలపై రగడ



ఇరువర్గాలతో చర్చిస్తున్న పోలీసులు

నేలకొండపల్లి: మట్టి తోలకం విషయంలో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరగగా పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మండలంలోని కోనాయిగూడెం శివారు గుట్ట (కోరటీన్) వద్ద మూడు రోజులుగా జేసీబీలతో మట్టి తవ్వి తరలిస్తున్నారు. అయితే, శనివారం సదరు భూమి తమదంటే తమదని ఇరువురు రైతులు గొడవ పడగా వారి తరఫున జనం చేరడంతో వివాదం నెలకొంది. ఈ విషయం తెలిసి చేరుకున్న పోలీసులు సరైన పత్రాలతో స్టేషన్‌కు రావాలని సూచించగా ఇరువర్గాల వారు వెళ్లారు. అయితే, హద్దులు తేలే వరకు ఎవరూ మట్టి తవ్వొద్దని పోలీసుల సూచనలతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. అయితే, మట్టి తవ్వకంపై మైనింగ్ అధికారులను వివరణగా తామెవరికీ అనమతి ఇవ్వలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నేలకొండపల్లి: ఓ కారు వేగంగా వెళ్తూ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా తీగలు తెగిపడడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో చిన్నారితో పాటు ముగ్గురికు తీవ్ర గాయాలయ్యాయి. నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లికి చెందిన పానుగోతు ఉపేందర్ కూసుమంచి మండలంలోని గట్టుసింగారం నుంచి కారులో శనివారం ఇంటికి వస్తున్నారు. రాజేశ్వరపురం వద్ద ఎదురుగా వస్తున్న గేదెను తప్పించే క్రమాన స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో కారు నుజునుజ్జు కాగా తీగలు తెగి పడగా స్థానికులు ఆందోళన చెందారు. ఈ ప్రమాదంలో పానుగోతు ఉపేందర్, మురళీనాయక్‌తో పాట ఏడేళ్ల బాలుడు జయంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం తరలించారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో పలువురు రైతుల ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు చోరీ అయ్యాయి. గ్రామ రైతులు యరమల వెంకట్రామిరెడ్డి, అయిలూరి కృష్ణారెడ్డి, పెద్ద కృష్ణారెడ్డి ట్రాక్టర్లలోని బ్యాటరీలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈమేరకు బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.